అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా

- మహిళలకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం
- మూడో విడత సాయం విడుదల
- మూడు నియోజకవర్గాల్లో డ్వాక్రా మహిళలకు రూ.117.74 కోట్ల లబ్ధి

ప్రత్తిపాడు రూరల్: అక్కచెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. 2019 ఏప్రిల్ 11 నాటికి స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ అప్పు మొత్తాన్ని నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే రెండు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం కింద మహిళలకు ఆర్థిక సాయం అందజేశారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో మూడో విడుత ఆసరా నిధులు విడుదల చేశారు.

14,888 సంఘాలకు...

ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లోని 14,888 డ్వాక్రా గ్రూపులకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.117.74 కోట్ల మేర లబ్ధి చేకూరింది. వాటిలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో 5,118 గ్రూపులకు రూ.35.77 కోట్లు, తుని నియోజకవర్గంలో 5,026 గ్రూపులకు రూ.41.65 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గంలో 4,744 సంఘాలకు రూ.40.32 కోట్ల వైఎస్సార్ ఆసరా సొమ్ములను ప్రభుత్వం విడుదల చేసింది.

మహిళల హర్షాతిరేకాలు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఆసరా నగదు జమ చేయడంతో పొదుపు మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు చేతి వృత్తులు, కిరాణా, దుస్తులు, కూరగాయల దుకాణాలు, కుట్టు మెషీన్లు, గొర్రెలు, మేకలు, ఆవుల పెంపకం, పాల వ్యాపారం తదితర రంగాల్లో రాణించి స్వయం ఉపాధి పొందుతూ కుటుంబానికి చేయూతనిస్తున్నారు.



ధర్మవరంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఆసరా పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండలాల వారీగా వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల వివరాలు

మండలం	డ్వాక్రా గ్రూపులు	ఆసరా నగదు (రూ.కోట్లలో)
ప్రత్తిపాడు	1373	10.54
ఏలేశ్వరం	1396	12.02
శంఖవరం	1056	8.06
రౌతులపూడి	793	5.15
ప్రత్తిపాడు	5118	35.77
కోటనందూరు	1039	8.22
తొండంగి	1481	12.09
తుని	2506	21.34
తుని	5026	41.65
గండేపల్లి	1177	8.75
జగ్గంపేట	1817	16.39
కిర్లంపూడి	1750	15.18
జగ్గంపేట	4744	40.32
మొత్తం	14888	117.74

పాడి గేదెను కొనుగోలు చేశాను



ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అండగా నిలుస్తోంది. వైఎస్సార్ ఆసరా, చేయూత పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన నగదుతో పాడిగేదెను కొనుగోలు చేసి దానిపై వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాను. వైఎస్సార్ ఆసరా పథకం కింద మా గ్రూపునకు రూ.1.04 లక్షలు వచ్చింది. ఇప్పటివరకూ మూడు విడుతలుగా లబ్ధి పొందాం.

– మేడిబోయిన రాజు, డ్వాక్రా సభ్యురాలు, ధర్మవరం

జీవనోపాధికి చేయూత



రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోంది. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతోంది. ప్రభుత్వ సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నారు. తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు మహిళల జీవనోపాధికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– యెనుగంటి వెంకట్, ఏపీఎం, ప్రత్తిపాడు

క్లుప్తంగా

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



లింగంపర్తిలో గోపూజ చేస్తున్న గుర్రం శివ దంపతులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తిలో సోమవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని బావివీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీనిలో భాగంగా ఆదివారం వేద పండితుడు నూకల చిట్టిబాబు ఆధ్వర్యంలో రుత్విక్కులు గ్రామానికి చెందిన గుర్రం శివ, మంగారాణి దంపతులతో హోమం నిర్వహించారు. గోపూజ, స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు క్షీరాధివాసం, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డ్వాక్రా సంఘాల మహిళలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ రామన్ ఆదివారం తెలిపారు. మండలంలోని 1177 డ్వాక్రా సంఘాలకు చెందిన 11770 మంది సభ్యులకు మూడో విడత ఆసరా పథకం కింద రూ.8.75 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

జగ్గంపేట: మండలంలోని రాజపూడిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీఎంపీ అసోసియేషన్ మండల గౌరవాధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి బూసాల విష్ణు ప్రారంభించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఆర్ఎస్ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ చైతన్య, డాక్టర్ ప్రసాద్ స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన 400 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బళ్లా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు టీఎస్ఎన్ మూర్తి, మండల కార్యదర్శి జగతా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మినీవ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని మల్లేపల్లి శివారులో ఆగి ఉన్న హైషర్ మినీవ్యాన్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై మల్లేపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున మినీ వ్యాన్ డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు వ్యాన్‌ను రోడ్డు పక్కన నిలిపాడు. బొగ్గు లోడుతో విజయవాడ వైపు వెళుతున్న లారీ ఆగి ఉన్న వ్యాన్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో వ్యాన్ రోడ్డుపక్కన తుప్పల్లోకి దూసుకుపోగా లారీ ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూమి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎండోమెంట్ శాఖ తీరుకు నిరసనగా సోమవారం చేపట్టిన తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. సత్రం భూమిలో ఉన్న జీడిమామిడి పంటను ఎండోమెంట్ అధికారుల సహకారంతో భూస్వాములు అమ్ముకున్నారన్నారు. ఈ అంశాలపై జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్టు తెలిపారు.

సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

కిర్లంపూడి: ముక్కొల్లులో వేంచేసిన సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముక్కొల్లు, రాజుపాలెం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రామ్‌చరణ్ అభిమానుల సందడి

ఏలేశ్వరం: సినీ హీరో రామచరణ్ నటించిన ఆర్ఆర్ఆర్ చిత్రానికి ఆస్కార్ అవార్డు రావడంతో ఆదివారం స్థానిక జయశ్రీ థియేటర్‌లో ఆరంజ్ సినిమా ప్రదర్శించారు. అభిమానులు రామచరణ్ బొమ్మలు ఉన్న టీ షర్టులను ధరించి సందడి చేశారు. థియేటర్ వద్ద చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేశారు. భవిషత్‌తో తెలుగు సినిమాలకు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు.

ఏరో డైనమిక్ ఫ్యాన్‌కు మరమ్మతులు



రోశయ్య మండపం వద్ద షెడ్డులో తిరుగుతున్న ఏరో డైనమిక్ ఫ్యాన్

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరిపై రోశయ్య మండపంలోని విశ్రాంతి షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఏరో డైనమిక్ ఫ్యాన్‌కు ఆదివారం మరమ్మతులు చేశారు. గత సెప్టెంబర్ 21న హైదరాబాద్‌కు చెందిన 'స్టార్ట్ రోటమాక్' కంపెనీ యాజమాన్యం ఈ ఫ్యాన్‌ను రత్నగిరి దేవస్థానానికి విరాళంగా అందజేసింది. దీని రెక్కలు పది అడుగుల పొడవు ఉంటాయి. ఈ ఫ్యాన్ తిరిగితే 20 అడుగుల దూరం వరకూ గాలి వీస్తుంది. దాదాపు మూడు నెలలుగా ఈ ఫ్యాన్ తిరగడం లేదు. దీనిపై ఆదివారం అలంకారప్రాయంగా ఏరోడైనమిక్ ఫ్యాన్ అనే శీర్షికతో ‹సాక్షి›లో వార్త ప్రచురితమైంది. దీనిపై ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్పందించి వెంటనే ఈ ఫ్యాన్ తిరిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది ఫ్యాన్‌కు మరమ్మతులు చేసి తిరిగేలా చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఫ్యాన్ తిరగడంతో దాని కింద భక్తులు సేదదీరారు.

ఎమ్మెల్యే చంటిబాబుకు సత్కారం



ఎమ్మెల్యే చంటిబాబును సత్కరించిన భూపతిపాలెం గురుకుల పాఠశాల విద్యార్థులు

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును ఆదివారం ఘనంగా సన్మానించారు. గోకవరం, జగ్గంపేట మండలాల సరిహద్దుల్లో అటవీ ప్రాంతం నడుమ భూపతిపాలెం గురుకుల పాఠశాల ఉంది. ఎన్నో ఏళ్లుగా ఈ పాఠశాలకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే చంటిబాబు పలుమార్లు పాఠశాలకు వచ్చిన సందర్భంలో రోడ్డు పరిస్థితిని గుర్తించి జగ్గంపేట మండలం రాజపూడి నుంచి గోకవరం మండలంలోని భూపతిపాలెం వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం గ్రామస్తులు సైతం ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ తనకు భూపతిపాలెం గురుకుల పాఠశాల అంటే ఎంతో ఇష్టమన్నారు. ఇక్కడ చదువుకున్న వారు ఎందరో దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గోకవరం మండల సచివాలయ కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, విత్తనాల అభివృద్ధి శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఇళ్ల అప్పారావుకాపు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, గుబ్బాలమ్మ ఆలయ చైర్మన్ నరాలశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్య నమస్కారాలు నిర్వహించారు. వేద పండితులు కొంపెల్ల మూర్తి, ఆకొండి కృష్ణశర్మ, రాందాసు తదితరులు ఉదయం తొమ్మిది గంటలకు సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పాల్గొన్నారు.

నేడు మంద కృష్ణమాదిగ రాక

తుని: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సోమవారం తుని నియోజవర్గానికి వస్తారని ఆ సంఘ నియోజకవర్గం కన్వీనర్ కింతాడ సత్తిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తొండంగి మండలం శృంగవృక్షం నూకాలమ్మ జాతరలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారని చెప్పారు. తుని నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

'చెవిరెడ్డి'ని కలిసిన రాజబాబు



అమరావతిలో చెవిరెడ్డిని కలిసిన జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాజబాబు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల కన్వీనర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కాకినాడ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు శనివారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. తనను జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమించినందుకు గాను అమరావతిలో చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ముగిసిన అమ్మవార్ల జాతరలు

గోకవరం: మండలంలోని గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో గత ఐదు రోజులుగా జరుగుతున్న గ్రామ దేవతల జాతరలు ఆదివారంతో ముగిసాయి. గోకవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద కొలువైన గుబ్బాలమ్మ జాతరకు చివరి రోజు భక్తులు పోటెత్తారు. కొత్తపల్లి గ్రామదేవత నూకాలమ్మ జాతరకు భక్తులు విశేష సంఖ్యలో వచ్చారు. సెలవు రోజు కావడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



కృష్ణాపురంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన టీడీపీ నేత సక్కా సూరిబాబు ఆధ్వర్యంలో సుమారు 25 మంది ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, కోన శ్రీనివాస్, సీయాదుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నడకతో బహుళ ప్రయోజనాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న భాస్కరరావు

తుని: వయసుతో సంబంధం లేకుండా వాకింగ్ చేయడం వలన బహుళ ప్రయోజనాలు కలుగుతాయని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.భాస్కరరావు అన్నారు. స్థానిక బాడవతోట రోడ్డులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ సమావేశం ఆదివారం ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ అధ్యక్షతన జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పి.శర్మ, సమన్వయకర్త ఎం.ప్రభావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ నియమ నిబంధనలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని, మహిళా సభ్యులు ఎక్కువగా పాల్గొనాలని ప్రభావతి సూచించారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా తుని వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు కుందెం భాస్కరరావుకు నివాళులర్పించారు. ఏరియా ఉపాధ్యక్షుడు డీడీ నాయుడు, రీజినల్ కౌన్సిలర్ ఎస్.తాతారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా సమన్వయకర్త టి.సత్యనారాయణరెడ్డి, జిల్లా సమన్వయకర్త బండి శ్రీనివాసరావు, మహిళాక్లబ్ అధ్యక్షురాలు, డిప్యూటీ గవర్నర్ రెడ్డి రత్నం, కుందెం సత్యనారాయణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ సభ్యులు

గోకవరం: అరుదైన బోన్‌మేరో వ్యాధికి గురై చెన్నైలో చికిత్స పొందుతున్న గోకవరానికి చెందిన బాలుడు పొట్నూరి అక్షయ్‌రామ్ వైద్యానికి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1996–2001 బ్యాచ్ విద్యార్థులు, ఫ్రెండ్స్ హెల్పింగ్ యూత్ సభ్యులు చేయూతనందించారు. అక్షయ్‌రామ్ పరిస్థితిపై చలించిన వారు రూ.40,700 నగదును సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం జెడ్పీ హైస్కూల్‌లో బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్యం విజయవంతమైన అక్షయ్‌రామ్ ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కణితి శ్రీనివాస్, ముమ్మిడివరపు భాస్కర్, అరిగిల సాంబ, కంది సూరిబాబు, నెల్లిపూడి జగదీష్, బత్తుల సతీష్, కుప్పిరెడ్డి వెంకటేష్, కృష్ణ, బాబి తదితరులు పాల్గొన్నారు.

భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు ప్రారంభం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న యోగానంద భారతీస్వామి

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం చిద్గగనానంద గీతాశ్రమంలో ఆదివారం భక్తిజ్ఞాన వేదాంత మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానంద భారతీస్వామి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నాయి. తొలిరోజు ప్రణవోపాసన, ప్రాతఃకాల ప్రార్థన, నగర సంకీర్తన, యోగానందా భారతీస్వామి వారితో పతాకారోహణ, సూర్యనమస్కారాలు, నిర్వహించారు. తొలుత దయానంద భారతీస్వామి జ్యోతి ప్రజ్వలన చేశారు. సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ప్రార్థనలు చేశారు. అనంతరం గీతాపారాయణ, గీతా యజ్ఞం, మహత్ముల ప్రవచనాలు, భజనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూమి సంరక్షణ అందరి బాధ్యత



తుని సరస్వతీ శిశుమందిర్ ఆవరణలో ధరిత్రికి పూజ చేస్తున్న తిరుపతయ్య, తదితరులు

తుని: స్వచ్ఛమైన భూమిని కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందని ఆంధ్ర ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ తిరుపతయ్య అన్నారు. తుని బ్యాంక్ కాలనీలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం భూమి సుపోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రకృతిని కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందని గుర్తు చేశారు. గోదావరి గ్రామ వికాస ప్రముఖ్ నర్సింగరావు, శ్రీరాములు, తుని–పాయకరావుపేట ఆర్ఎస్ఎస్ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియెట్, 6, 7, 8 ,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కేజీబీవీ ప్రత్యేక అధికారి బి.అమృతవాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరతగతిలో 40, ఇంటర్మీడియెట్ బైపీసీ 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాప్ అవుట్లు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్‌కు దిగువన ఉన్న బాలికలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27 నుంచి 20 వరకూ ఏపీకేజీబీవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 84990 80847 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శంఖవరంలో..

శంఖవరం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.బాలామణి కుమారి ఆదివారం తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అర్హులైన బాలికలు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకూ ఏపీ కేజీబీవీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



శంఖవరంలో అగ్నిప్రమాద బాధితులకు సరకులు అందిస్తున్న నాసా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శంఖవరం: గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నేలపాటి భూషణం కుటుంబానికి నాసా స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. బాధితులకు సోమవారం నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బియ్యం, కిరాణా సరకులు, రగ్గులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. బాధితులను ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందిలి గనియమ్మ, నాసా సంస్థ డైరెక్టర్ ఎస్.సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గోపాలపురం పామాయిల్ తోటలో కలిసిన పూర్వ విద్యార్థులు

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి హైస్కూల్‌కు చెందిన 2003–2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువు అనంతరం ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వేర్వేరు చోట్ల స్థిరపడిన వీరంతా కె.గోపాలపురం పామాయిల్ తోటలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు.

ఆలయానికి కంచు విగ్రహాల సమర్పణ



వజ్రకూటంలో రామాలయానికి కంచు విగ్రహాలు సమర్పిస్తున్న సర్పంచ్ గుర్రాజు, వీరమల్లిక దంపతులు

శంఖవరం: మండలంలోని వజ్రకూటంలో వేంచేసిన రామాలయానికి ఆ గ్రామ సర్పంచ్ సకురు గుర్రాజు, వీరమల్లిక దంపతులు కంచు ఉత్సవ విగ్రహాలను సమర్పించారు. దాతలు సమర్పించిన సీతారాములు, లక్ష్మణస్వామి, ఆంజనేయ స్వామి వార్ల కంచు విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ఆలయంలో ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన బృందాల సభ్యులు భజనలు చేశారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



శృంగవృక్షంలో అంబేడ్కర్ విగ్రహం నిరసన తెలుపుతున్న జైభీమ్ మాలమహానాడు నాయకులు

తొండంగి: మండలంలోని శృంగవృక్షం నూకాలమ్మ జాతర జరిగిన ఘర్షణలో మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబంతో పాటు గాయపడిన వారికి న్యాయం చేయాలని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తొండంగిలో మృతుడు నడిపల్లి రాము కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం శృంగవృక్షంలో గాయపడిన బాధితులను పరామర్శించారు. గాయపడినవారికి సరైన వైద్యం అందించి నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పెయ్యల సూర్యారావు, రుతల సత్తిబాబు, యాదగిరి సుధీర్, కర్రి నూకరాజు, పిల్లి బాబ్జి, బండి చిట్టిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

తొండంగి: శృంగవృక్షం గ్రామదేవత జాతర సందర్భంగా జరిగిన దాడిలో మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబానికి అండగా ఉంటామని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం తొండంగిలో మృతుడి కటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట పలువురు టీడీపీ నాయకులు, దళిత నాయకులు ఉన్నారు.